సాక్షి
పెద్దపల్లి
సోమవారం । 26 । ఆగస్టు । 2024



ఆదివరాహస్వామికి మొక్కులు

కమాన్‌పూర్‌: శ్రావణమాసం సందర్భంగా ఆదివారం మండలకేంద్రంలోని శ్రీఆదివరాహస్వామి సన్నిధికి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.



మల్లన్న సన్నిధిలో రద్దీ

ఓదెల: శ్రావణమాసం సందర్భంగా ఆదివారం ఓదెల మల్లన్న సన్నిధిలో భక్తుల రద్దీ నెలకొంది. బోనాలు, పట్నాల మొక్కులు చెల్లించుకున్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0/25.0

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో అక్కడక్కడా చెదురుమదురు జల్లులు కురిసే అవకాశం ఉంది. ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్‌

బీసీలను మోసం చేసిన కాంగ్రెస్‌

- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు



దీక్షలో పుట్ట మధు, బీఆర్‌ఎస్‌ నాయకులు

మంథని: అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఓట్ల కోసం బీసీ డిక్లరేషన్‌ పేరుతో ఆ సామాజిక వర్గాలను కాంగ్రెస్‌ మోసం చేసిందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు అన్నారు. బీపీ మండల్‌ జయంతి సందర్భంగా మంథనిలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ అమలు చేయాలని డిమాండ్‌ చేస్తూ బీసీ హక్కుల దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ, కాంగ్రెస్‌ అంటేనే మోసమని, నాటి నుంచి నేటి వరకు అదే విధమైన పాలన అందిస్తోందన్నారు. బీసీ రిజర్వేషన్‌ విషయంలో నాడు నెహ్రూ పూటకో మాట మాట్లాడి, రోజుకో విషయం చెప్పి బీసీ రిజర్వేషన్‌కు అడ్డుపడ్డారని విమర్శించారు. 2 వేల ఎకరాలకు భూస్వామిగా ఉన్న బిందేశ్వరి ప్రసాద్‌ సమాజం ఆకలి కన్నీళ్లు అర్థం చేసుకొని ఆ దిశగా పనిచేసిన మహనీయులని కొనియాడారు. దేశమంతా తిరిగి బీసీల కష్టాలు తెలుసుకొని రిజర్వేషన్లతోనే న్యాయం జరుగుతుందని కేంద్రం, రాష్ట్రపతికి ప్రతిపాదనలు చేశారని పేర్కొన్నారు. బీసీ సమాజాన్ని మోసం చేసేందుకు కాంగ్రెస్‌ అనేక కుట్రలు చేస్తుందని, బీసీలకు రాజకీయ అవకాశాలు రాకపోవడానికి కారణం మోసపూరిత మాటలేనన్నారు. బీసీ డిక్లరేషన్‌ అమలు చేసే వరకు వదిలిపెట్టే ప్రసక్తే లేదని, బీసీలంతా చైతన్యవంతులై మహనీయుల స్ఫూర్తితో ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. నాయకులు ఏగోళపు శంకర్‌గౌడ్‌, ఆరెపల్లి కుమార్‌, సెగ్గెం రాజేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌తో జీఎంల భేటీ

గోదావరిఖని(రామగుండం): డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఈ నెలాఖరులో రామగుండం రీజియన్‌లో పర్యటించనున్న నేపథ్యంలో ఎమ్మెల్యే ఎంఎస్‌ రాజ్‌ఠాకూర్‌తో ఆర్జీ–1, 2 జీఎంలు లలిత్‌కుమార్‌, ఎల్‌వీ సూర్యనారాయణ ఆదివారం భేటీ అయ్యారు. డిప్యూటీ సీఎం చేతుల మీదుగా స్కిల్‌డెవలప్‌మెంట్‌ సెంటర్‌, పలు రోడ్లు, మేడిపల్లి ఓసీపీలో 500 మెగావాట్ల హైడ్రోపవర్‌ ప్లాంట్‌ ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే రామగుండం రీజియన్‌లోని జీడీకే –11, వకీల్‌పల్లిగనిలో ఏదో ఒక గనిని సందర్శించి గనిలోని పనిస్థలాలు పరిశీలించనున్నట్లు తెలుస్తోంది. ఈక్రమంలో ఎమ్మెల్యే, జీఎంలు పలు అంశాలపై చర్చించారు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా ప్రభాకర్‌



ప్రభాకర్‌ను సన్మానిస్తున్న ఆర్య వైశ్య సంఘం నాయకులు

మంథని: ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా మంథనికి చెందిన నలుమాసు ప్రభాకర్‌ ఎన్నికయ్యాడు. ఆదివారం జరిగిన జిల్లా ఎన్నికల్లో ప్రభాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం నాయకులు పేర్కొన్నారు. ప్రభాకర్‌ ఎన్నికపై న్యాయవాది, మున్నూరు కాపు మహాసభ జిల్లా కన్వీనర్‌ ఇనుముల సతీశ్‌, కాంగ్రెస్‌ నాయకులు రావికంటి సతీశ్‌ హర్షం వ్యక్తం చేశారు. తన నియామకానికి సహకరించిన మంత్రి శ్రీధర్‌బాబుకు ప్రభాకర్‌ కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ మహాసభలకు తరలిరండి

గోదావరిఖని(రామగుండం): ఐఎఫ్‌టీయూ జాతీయ మహాసభలకు పెద్ద సంఖ్యలో కార్మికులు తరలిరావాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు కె.విశ్వనాథ్‌ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక తిలక్‌నగర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. వచ్చేనెల 1, 2 తేదీల్లో మహారాష్ట్రలోని పూణేలో యూనియన్‌ 8వ జాతీయ మహాసభలు జరగనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు బి.యాకయ్య, ఇస్మాయిల్‌, రత్నకుమార్‌ బంగారు కృష్ణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పరిష్కారమయ్యేనా..?!

- 'రామగుండం రీజియన్‌లో పనిచేస్తున్న ఆపరేటర్లకు మూడేళ్లుగా పదోన్నతి కల్పించడం లేదని 49 మంది ఈపీ ఆపరేటర్లు గ్రీవెన్స్‌లో డైరెక్టర్‌(పా)కు ఫిర్యాదు చేయగా, సానుకూలంగా స్పందించారు. సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు'.

- 'నాలుగేళ్ల సీఎంపీఎఫ్‌ సొమ్ము మాయమైందని ఓసీపీ–2కు చెందిన కుమార్‌ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయగా, సంబంధిత అధికారులు పరిశీలించి సమస్య పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఇలా రామగుండం రీజియన్‌లో సుమారు 300మంది ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు'.



ఇటీవల గ్రీవెన్స్‌లో దరఖాస్తులు సమర్పిస్తున్న కార్మికులు

- సింగరేణిలో ముచ్చటగా మూడోసారి గ్రీవెన్స్‌ డే
- కార్మికుల సమస్యలపై వెల్లువెత్తిన ఫిర్యాదులు
- నేరుగా దరఖాస్తులు స్వీకరించిన డైరెక్టర్‌(పా)

గోదావరిఖని(రామగుండం): సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఇటీవల నిర్వహించిన గ్రీవెన్స్‌కు కార్మికుల నుంచి దరఖాస్తులు వెల్లువెత్తాయి. డైరెక్టర్‌(పా) ఎన్‌వీకే శ్రీనివాస్‌ నేరుగా ఫిర్యాదులు స్వీకరించిన, సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సాధ్యం కాని సమస్యలపై పూర్తి స్థాయిలో హామీ ఇవ్వలేదు. ఈనెల 14న నిర్వహించిన గ్రీవెన్స్‌లో సాయంత్రం నుంచి రాత్రి వరకు డైరెక్టర్‌(పా) ఫిర్యాదులు స్వీకరించారు.

వెల్లువలా దరఖాస్తులు

జిల్లాలోని రామగుండం రీజియన్‌ ఆర్జీ–1,2,3, ఏపీఏ ఏరియాల్లోని కార్మికులు ఆర్జీ–1 ఏరియా జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్‌ హాలులో ఇటీవల నిర్వహించిన గ్రీవెన్స్‌కు తరలివచ్చారు. అనారోగ్య సమస్యలు, పదోన్నతి, ఇన్సెంటివ్‌, బేసిక్‌, క్వార్టర్‌ కేటాయింపు, బదిలీలు తదితర సమస్యలపై 300పైగా దరఖాస్తులు సమర్పించారు. డైరెక్టర్‌(పా) ఫిర్యాదులు స్వీకరించి సంబంధిత అధికారుల నుంచి అక్కడే వివరాలు సేకరించారు. కాగా, ఇటీవల కాలంలో సంస్థ సీఎండీ కార్యాలయానికి ఫిర్యాదులు ఎక్కువగా వస్తుండటంతో సీఎండీ ఎన్‌.బలరాం స్పందించారు. ఏరియాల వారీగా గ్రీవెన్స్‌ నిర్వహించాలని సూచించారు.

స్ట్రక్చరల్‌ సమావేశాలు లేకపోవడంతో..

సింగరేణి ఎన్నికల్లో గెలుపొందిన గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలతో ప్రతీ మూడు నెలలకోసారి స్ట్రక్చరల్‌ సమావేశాలను యాజమాన్యం నిర్వహించేది. ఏరియాల వారీగా గుర్తింపు, ప్రాతినిధ్య సంఘం నెలకోసారి, సింగరేణి స్థాయి స్ట్రక్చర్‌ సమావేశం మూడు నెలల కోసారి జరిగేది. ప్రస్తుతం గుర్తింపు యూనియన్‌గా ఏఐటీయూసీ గెలుపొంది ఏడునెలలు గడిచినా యాజమాన్యం గుర్తింపు పత్రం అందజేయలేదని సమావేశాలకు దూరంగా ఉంటున్నారు. ఈక్రమంలో ఏరియా, సింగరేణి స్థాయి సమస్యలు పేరుకుపోతున్నాయని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఇటీవల యాజమాన్యం నిర్వహించిన గ్రీవెన్స్‌కు పెద్ద ఎత్తున స్పందన లభించింది.

ఐదేళ్ల క్రితం మొదటిసారి..

2019లో అప్పటి డైరెక్టర్‌(పా) పవిత్రన్‌కుమార్‌ సింగరేణిలో మొదటిసారి గ్రీవెన్స్‌ నిర్వహించారు. ప్రస్తుత సీఎండీ డైరెక్టర్‌(పా)గా ఉన్న సమయంలో 2021లో రెండోసారి గ్రీవెన్స్‌సెల్‌ నిర్వహించారు. గతంలో రెండుసార్లు నిర్వహించిన గ్రీవెన్స్‌లలో పెద్దగా స్పందన లేదని కార్మికులు పెదవి విరుస్తున్నారు. ప్రస్తుతం సమస్యలు ఏ మేరకు పరిష్కారం అవుతాయోనని కార్మికులు ఎదురు చూస్తున్నారు.

దరఖాస్తులపై అధికారుల దృష్టి

ఏరియాల వారీగా గ్రీవెన్స్‌లో అందిన దరఖాస్తులను పర్సనల్‌ అధికారులు లోతుగా పరిశీలిస్తున్నారు. డైరెక్టర్‌(పా) ఆదేశాల మేరకు సమస్య తీరు, పరిష్కారం తదితర అంశాలపై ఆయా విభాగాల అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నారు. సాధ్యమైనంత త్వరగా దరఖాస్తులను ఫిల్టర్‌ చేసి సమస్యలపై పరిష్కారం లేదా స్థితిని కార్మికులకు వెల్లడించేలా కసరత్తు చేస్తున్నారు.



ఇటీవల గ్రీవెన్స్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న సింగరేణి అధికారులు

సీజనల్‌ వ్యాధులపై 'సాక్షి' ఫోన్‌ ఇన్‌

సాక్షి ఫోన్‌ ఇన్‌

పెద్దపల్లిరూరల్‌/కోల్‌సిటీ: జిల్లాలో సీజనల్‌ వ్యాధులు ప్రబలుతున్నాయి. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా చాలామంది వైరల్‌ జ్వరాల బారిన పడుతున్నారు. కాళ్లు, కీళ్లు, ఎముకల నొప్పులకు లోనవుతున్నారు. ఇంకా కొందరికి ప్లేట్‌లెట్లు పడిపోయి వైద్యసేవల కోసం ఆసుపత్రుల్లో చేరుతున్నారు. జ్వరం రావడం, తగ్గినా నీరసంగానే ఉండడం లాంటి లక్షణాలపై ఉన్న సందేహాలు, వైద్య సలహాల కోసం 'సాక్షి' ఫోన్‌ ఇన్‌ కార్యక్రమం నిర్వహిస్తోంది. సోమవారం గోదావరిఖని ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రి(జీజీహెచ్‌) ఆర్‌ఎంవో, మంగళవారం పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ప్రజలు తమ సందేహాలను వైద్యుల దృష్టికి తెచ్చి సలహాలు పొందవచ్చు.

గోదావరిఖని

ఫోన్‌ చేయాల్సిన నంబర్‌:
96400 69188
తేదీ: 26.08.2024, సోమవారం
సమయం:
మధ్యాహ్నం 12 గంటల నుంచి 1 గంట వరకు



డాక్టర్‌ చంద్రశేఖర్‌ ఆర్‌ఎంవో

పెద్దపల్లి

ఫోన్‌ చేయాల్సిన నంబర్‌:
84990 61999
తేదీ: 27.08.2024 మంగళవారం
సమయం :
ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు



డాక్టర్‌ శ్రీధర్‌, జిల్లా ఆసుపత్రుల సూపరింటెండెంట్‌

క్రీడలకు పుట్టినిల్లు సుల్తానాబాద్‌



క్రీడాకారులతో ఎమ్మెల్యే విజయరమణారావు, నాయకులు

- ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్‌(పెద్దపల్లి): క్రీడారంగానికి పెద్దపీట వేస్తానని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్‌ పట్టణం మార్కండేయకాలనీలో మినీ స్టేడియంలో నిర్వహిస్తున్న ఖే లో ఇండియా ఖోఖో శిబిరాన్ని ఆదివారం సందర్శించి మాట్లాడారు. క్రీడలకు పుట్టినిల్లు సుల్తానాబాద్‌ అని, ఇక్కడి నుంచి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొన్నవారు ఉన్నారని వివరించారు. గత ప్రభుత్వం క్రీడల పట్ల నిర్లక్ష్యం వహించిందని, ప్రస్తుత ప్రభుత్వం క్రీడాకారులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని రానున్న రోజుల్లో ఒలింపిక్స్‌లో పతకాలు సాధించేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతుందన్నారు. అనంతరం క్రీడాకారులకు టీ షర్టులు, క్రీడా సామగ్రి అందజేశారు. స్వయంగా క్రీడాకారుడు అయిన సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణలో క్రీడారంగం అభివృద్ధికి పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. ఆసియా, కామన్వెల్త్‌ గేమ్స్‌లో తెలంగాణ సత్తా చాటేందుకు స్పోర్ట్స్‌ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. డీవైఎస్‌వో సురేశ్‌, మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ గాజుల లక్ష్మి రాజమల్లు, వైస్‌ చైర్‌పర్సన్‌ బిరుదు సమతా కృష్ణ, సింగిల్‌ విండో చైర్మన్‌ శ్రీగిరి శ్రీనివాస్‌, స్పోర్ట్స్‌ క్లబ్‌ అధ్యక్షుడు ఎం.రవీందర్‌, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

పేదలందరికీ పథకాలు అందాలి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌

- రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్‌ రాజ్‌ఠాకూర్‌

గోదావరిఖని(రామగుండం): పేదలందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత గ్రామ అధికారులపై ఉందని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్‌ రాజ్‌ఠాకూర్‌ అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అంతర్గాం, పాలకుర్తి మండలాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతీ గ్రామంలో తాగునీరు, వీధి దీపాలు, మురికి కాల్వల సమస్యలు తెలుసుకోవాలని సూచించారు. అంతర్గాం, పాలకుర్తి మండలాల్లోని పాఠశాలల అభివృద్ధికి రూ.2 కోట్ల నిధులు ఇచ్చామని పేర్కొన్నారు. వన మహోత్సవంలో భాగంగా ప్రతీ గ్రామంలో మొక్కలు నాటాలని, గ్రామాల్లో క్లోరినేషన్‌, మురికి కాలువల పరిశుభ్రతపై దృష్టి సారించాలన్నారు. రెండు మండలాల్లోని 35గ్రామాల్లో సమస్యలను సేకరించి రాతపూర్వకంగా క్యాంపు కార్యాలయంలో తనకు అందజేయాలన్నారు. సింగరేణి సహకారంతో గ్రామాల్లో సోలార్‌ వీధీ దీపాలు ఏర్పాటు చేయనున్నాన్నట్లు పేర్కొన్నారు.

తాగునీరు సరఫరా చేయాలని వినతి

రామగుండం: ఎన్టీపీసీ పునరావాస గ్రామం మొగల్‌పహాడ్‌లో నిర్వాసిత కుటుంబాలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా లేకపోవడం, భగీరథ నీరు పాక్షికంగా సరఫరా కావడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మేరకు ఆదివారం గ్రామస్తులు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్‌ను కలిసి సమస్యలను ఏకరువు పెట్టారు. అంతర్గత రహదారులు పూర్తిగా శిథిలమయ్యాయని, గ్రామంలో కొన్ని కాలనీలకు మాత్రమే భగీరథ తాగునీరు సరఫరా అవుతుందని, కమ్యూనిటీ హాల్‌లో విద్యుత్‌ సరఫరా లేకపోవడంతో నిరుపయోగంగా ఉండడం తదితర సమస్యలను వివరించారు. ఎన్టీపీసీపై ఒత్తిడి తీసుకువచ్చి సత్వరమే అభివృద్ధి పనులు చేయించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో గెల్లు నరేశ్‌, శ్రావణ్‌కుమార్‌ తదితరులు ఉన్నారు.

మల్టీజోన్‌లో సీఐల బదిలీ

గోదావరిఖని(రామగుండం): మల్టీజోన్‌లో పలువురు సీఐలను బదిలీ చేస్తూ ఐజీ ఆదేశాలు జారీ చేశారు. బి.సత్యనారాయణ కొత్తగూడెం నుంచి ఖమ్మం– ట్రాఫిక్‌, బి.హాతిరాం సీసీఎస్‌ 1– మహబూబాబాద్‌, ఇ.చంద్రమౌళి సీసీసీ–1 నుంచి డీఎస్‌బీ– మహబూబాబాద్‌, పి.బాలాజీవరప్రసాద్‌ డీఎస్‌బీ నుంచి మల్టీజోన్‌ 1– ఐజీ, బి.రాజేశ్వర్‌రావు సీఎస్‌బీ 3 –రామగుండం, ఎ.రమాకాంత్‌ ఆదిలాబాద్‌ నుంచి సీసీఎస్‌ 2– కొత్తగూడెం, వి.అనిల్‌కుమార్‌ సీసీఎస్‌–ములుగు, టి.శ్రీధర్‌ సీఎస్‌బీ 4– రామగుండం, జి.అజయ్‌బాబు సైబర్‌క్రైం 1– రామగుండం, ఆర్‌.కృష్ణ లీగల్‌సెల్‌– రామగుండం, కె.నాగేశ్వర్‌రావు డీఎస్‌బీ– రాజన్నసిరిసిల్ల, బి.కేశవులు సీసీఎస్‌ 1– ఆసిఫాబాద్‌కు పోస్టింగ్‌ ఇచ్చారు.

టీజీఎస్‌ఆర్టీసీ 'గమ్యం'

- ప్రయాణికుల కోసం ప్రత్యేక యాప్‌
- సేవలు విస్తృతపరుస్తున్న ఆర్టీసీ

TGSRTC
Gamyam
Track-Ride-Arrive



ప్రయాణికులకు యాప్‌పై అవగాహన కల్పిస్తున్న ఆర్టీసీ అధికారి

పెద్దపల్లిరూరల్‌: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రయాణికులకు చేరువయ్యేందుకు సేవలను విస్తృతపరుస్తోంది. ప్రజలు తమ గమ్యస్థానాలకు చేర్చే ఆర్టీసీ, సరుకులను రవాణా చేసేందుకు కార్గో లాంటి సేవలతో పాటు వివిధ పథకాలను అమలు చేస్తోంది. ఆదాయాన్ని పెంచుకోవడానికి మార్గాలు అన్వేషిస్తోంది. పండుగలతో పాటు పుణ్యక్షేత్రాలకు వెళ్లేందుకు, ప్రత్యేక రోజుల్లో ప్రయానికులు రాకపోకలు సాగించేలా ఆకర్షణీయమైన ఆఫర్లను అందిస్తోంది. ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం చేసే అవకాశాన్ని మహాలక్ష్మి పథకం ద్వార కల్పించడంతో బస్సుల్లో ప్రయాణించే మహిళల సంఖ్య పెరిగింది. వారు బస్సు ప్రయాణంలో తమ భద్రత కోసం గమ్యం యాప్‌ను వినియోగించుకోవచ్చు.

అందుబాటులోకి 'గమ్యం'

బస్సు ఎక్కడుంది.. ఎప్పుడు వస్తుందో.. తెలుసుకునేలా గమ్యం పేరుతో బస్సు ట్రాకింగ్‌ యాప్‌ను ఆర్టీసీ అందుబాటులోకి తెచ్చింది. గతంలో టీఎస్‌ఆర్టీసీ పేరుతో యాప్‌ ఉన్నప్పటికీ అందులో పూర్తి స్థాయిలో సమాచారం లేకపోయింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులుపడ్డారు. ఆ యాప్‌ స్థానంలో సరికొత్త ఫీచర్లతో గమ్యం యాప్‌ను అమల్లోకి తెచ్చింది. మహిళ ప్రయాణికుల భద్రతకు పెద్దపీట వేసేలా ఈ యాప్‌ను రూపొందించారు. గమ్యం యాప్‌ ద్వారా ప్రయాణికులు తమకు అవసరమైన సంపూర్ణ సమాచారాన్ని సులువుగా తెలుసుకోవచ్చు. ప్రయాణికులు తాము ఎక్కాల్సిన బస్సు ఎక్కడుంది.. మనమున్న ప్రాంతానికి ఎన్ని గంటలకు వస్తుందో.. బస్సు డ్రైవర్‌, కండక్టర్ల వివరాలు, ఫోన్‌ నంబర్లు యాప్‌లో అందుబాటులో ఉంటాయి. దూరప్రాంత సర్వీసులకు రిజర్వేషన్‌ నంబర్‌ ఆధారంగా బస్సులకు ట్రాకింగ్‌ చేసే వెసులుబాటు కల్పించారు. జిల్లాలోని గోదావరిఖని, మంథని ఆర్టీసీ డిపోల పరిధిలో 200 వరకు బస్సులున్నాయి. పల్లె వెలుగు మొదలు ఎక్స్‌ప్రెస్‌, డీలక్స్‌, సూపర్‌ లగ్జరీ, రాజధాని, లహరి లాంటి అన్ని బస్సులకు ప్రత్యేకంగా 'ట్రాకర్‌' అమర్చారు. దాన్ని జీపీఎస్‌ సిస్టం ద్వారా యాప్‌కు అనుసంధానం చేసినట్టు ఆర్టీసీ అధికారి తెలిపారు. ఈ యాప్‌ను గూగుల్‌ ప్లే స్టోర్‌ నుంచి డౌన్లోడ్‌ చేసుకోవచ్చని, ప్రత్యేకంగా వ్యక్తిగత వివరాలు నమోదు చేయాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

అధికారులకు సమాచారమివ్వొచ్చు

ఆర్టీసీ అందుబాటులోకి తెచ్చిన గమ్యం యాప్‌ను డయల్‌ 100కు అనుసంధానం చేశారు. అత్యవసర సమయాల్లో లేదా ఏదైనా ప్రమాదం పొంచి ఉందని భావించినా నేరుగా పోలీసులకు సైతం సమాచారం అందించేలా యాప్‌ను రూపొందించారు. బస్‌ బ్రేక్‌ డౌన్‌, వైద్య సహాయం, రోడ్డు ప్రమాదం తదితర వివరాలను ప్రయాణికులు ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లొచ్చు. ఆ సమాచారం ఆధారంగా అధికారులు అవసరమైన చర్యలు తీసుకుంటారు.

సౌలభ్యంగా ఉంది



ఆర్టీసీ అందుబాటులోకి తెచ్చిన గమ్యం యాప్‌ ఎంతో సౌలభ్యంగా ఉంది. ప్రయాణికులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. మన ప్రయాణం చేయాలనుకునే బస్సు కోసం నిరీక్షించి సమయం వృథా చేసుకోనక్కరలేదు. ఈ యాప్‌పై ప్రజల్లో ఇంకా అవగాహన పెరగాలి.

– మిట్టపల్లి శ్రీనివాస్‌, పెద్దబొంకూర్‌

ప్రయాణికులు వినియోగించుకోవాలి



ఆర్టీసీ బస్సుల్లో సురక్షితంగా ప్రయాణం చేయవచ్చు. ప్రయాణికుల సౌలభ్యం కో సం సంస్థ తెచ్చిన గమ్యం యాప్‌పై అవగాహన పెంచుకుని సద్వినియోగం చేసుకోవాలి. అప్పుడప్పుడు బస్‌స్టేషన్‌లో ప్ర యాణికులకు అవగాహన కల్పిస్తున్నాం.

– రాంగోపాల్‌రెడ్డి, బస్‌స్టేషన్‌ మేనేజర్‌

సర్కారు ఆలోచనకు తూట్లు

- నర్సింగ్‌ విధుల్లో పేషెంట్‌ కేర్‌ టేకర్స్‌
- వైద్యులు, సిబ్బంది వ్యక్తిగత పనుల్లోనూ వీరే..
- అవగాహనలేమితో అనర్థాలు



మంథని సామాజిక వైద్యశాల

మంథని: ప్రభుత్వాసుపత్రుల్లో పనిచేసే నర్సింగ్‌ ఆఫీసర్లు, కిందిస్థాయి వైద్య సిబ్బంది పని ఒత్తిడి కారణంగా పేషెంట్లను సరిగా పట్టించుకోవడం లేదనే ఫిర్యాదుల నేపథ్యంలో రోగుల సేవల కోసం ప్రభుత్వం పేషెంట్‌ కేర్‌ టేకర్స్‌ను నియమించింది. వీరు ఆస్పత్రుల్లో రోగులకు సంబంధించిన సేవలు అనగా రోగులు, వైద్యులు, సిబ్బందికి వారధులుగా పనిచేయాలి. కానీ, క్షేత్రస్థాయిలో వీరి పనితీరు మరోరకంగా ఉంటోంది. కొన్ని సందర్భాల్లో వైద్యులు, సిబ్బంది వీరిని తమ వ్యక్తిగత పని మనుషులుగా వినియోగించుకుంటున్నట్లు తెలుస్తోంది.

వైద్య సేవలు సైతం

పేషెంట్‌ కేర్‌ చూడాల్సిన వీరు ఏకంగా వైద్య సేవలు కూడా అందించే పరిస్థితులు అనేక అనర్థాలకు దారితీస్తున్నాయి. పేషెంట్లకు అమర్చిన సెలైన్ల పరిస్థితిని పరిశీలించి వైద్య సిబ్బందికి సమాచారం అందించాల్సి ఉండగా ఏకంగా వారే సెలైన్లు పెట్టే పరిస్థితులు నెలకొన్నాయి. పేషెంట్లకు మందులిచ్చే విధులను కూడా అక్కకక్కడా చేపట్టడం విమర్శలకు తావిస్తోంది. కేర్‌ టేకర్లపై భరోసాతో కొన్ని ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది తమ విధుల పట్ల అలసత్వం వహిస్తున్న ఘటనలు ఇటీవల వెలుగుచూశాయి. ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాలోని ఓ ప్రభుత్వాసుపత్రిలో పేషెంట్‌ కేర్‌ టేకర్‌ సైలెన్‌ పెట్టగా డ్యూటీలో ఉన్న నర్సింగ్‌ ఆఫీసర్‌పై చర్య తీసుకున్నారు.

వ్యక్తి పనుల్లో..

జిల్లా ప్రధాన ఆస్పత్రితో పాటు మంథని, సుల్తానాబాద్‌, గోదావరిఖని సామాజిక వైద్యశాలల్లో కేర్‌ టేకర్లు థర్డ్‌ పార్టీ విధానంలో పనిచేస్తున్నారు. కాగా, వీరిని కొంత మంది వైద్యులు, సిబ్బంది తమ వ్యక్తిగత పనులకు వినియోగుంచుకుంటున్నట్లు సమాచారం. ఆస్పత్రుల్లో పనిచేసే వైద్యులు, సిబ్బంది ప్రైవేటుగా నిర్వహించుకునే ఆస్పత్రుల్లో సైతం వీరితో క్లీనింగ్‌తో పాటు వారి ఇంటి పనులు సైతం చేయిస్తున్నట్లు తెలిసింది. కాగా మంథని సామాజిక వైద్యశాలలో ఈనెల 15న ఆస్పత్రి సూపరింటెండెంట్‌ తనను అవమానపరిచేలా పనికి పురమాయించాడని ఓ కేర్‌ టేకర్‌ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

బయటకు వస్తేనే..

తమ కుటుంబ పోషణ కోసం ఏదో ఒక పని చేయాల్సిన పరిస్థితుల్లో ఇబ్బందులు ఎదురైనా కేర్‌ టేకర్లుగా విధులు నిర్వహించేందుకు ముందుకు వస్తున్నవారు చెప్పుకోలేని సమస్యలతో తమలో తామే కుమిలిపోతున్నారు. వచ్చేది అత్తెసరు వేతనమే అయినా పనులు మాత్రం వేతానానికి పదిరెట్లు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. తాము పని మనుషులమో లేక ఆస్పత్రుల్లో పనిచేసేవాళ్లమో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ విధులకు విరుద్ధంగా చేపట్టే పనులు అక్కడక్కడా బయటపడుతుండగా అధికారులు కంటితుడుపు చర్యలు మాత్రమే చేపడుతున్నారని వాపోయారు. ఇంకా ఇలా బయటకు రాకుండా చెప్పుకోలేని విధంగా తమతో పనులు చేయించుకుంటున్నారని, ఇప్పటికైనా తాము మనుషులమేనని గుర్తించి నిబంధనల ప్రకారం విధులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

మహిళ బలవన్మరణం


లక్ష్మి మృతదేహం

ధర్మపురి: బూరుగుపల్లెకు చెందిన ఎర్రం లక్ష్మి(45) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం .. లక్ష్మి కొన్నేళ్లుగా కడుపు నొప్పితో బాధ పడుతోంది. ఎన్ని ఆస్పత్రులకు వెళ్లి, చికిత్స పొందినా నయం కాలేదు. జీవితంపై విరక్తి చెంది, ఆదివారం ఇంట్లోనే ఉరేసుకుంది. మృతురాలికి భర్త, కుమారుడు, కూతురు ఉన్నారు. భర్త మల్లేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కేశాపూర్‌లో ఇంటర్ విద్యార్థి..


రాకేశ్ (ఫైల్)

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): కేశాపూర్‌కు చెందిన ఇంటర్ విద్యార్థి లక్కం రాకేశ్(16) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. రాకేశ్ ఇబ్రహీంపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. తండ్రి సాయన్న బతుకుదెరువు కోసం గల్ఫ్ వెళ్లాడు. రాకేశ్ కళాశాలకు సక్రమంగా వెళ్లకపోవడంతో తల్లి గంగలక్ష్మి మందలించింది. దీంతో అతను మనస్తాపానికి గురై, శనివారం క్రిమిసంహారక మందు తాగాడు. తల్లి మెట్‌పల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లింది. పరిస్థితి విషమించడంతో రాత్రి నిజామాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రైలు కిందపడి గుర్తు తెలియని యువకుడి ఆత్మహత్య?

ఓదెల(పెద్దపల్లి): గుర్తు తెలియని యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడని భావిస్తున్నట్లు మంచిర్యాల రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సంపత్ తెలిపారు. కాజీపేట్–బల్లార్షా సెక్షన్ల మధ్యలోని ఓదెల మండలం పొత్కపల్లి–బిజిగిరిషరీఫ్ రైల్వేస్టేషన్ల మధ్య డౌన్ లైన్‌లో ఆదివారం మృతదేహం కనిపించిందన్నారు. మృతుడి వయసు 35 ఏళ్ల వరకు ఉంటుందని, అతని చేతిపై ఐ లవ్ వైఎస్‌యూ అన్న పచ్చబొట్టు ఉందని తెలిపారు. ఆ యువకుడి తల నుజ్జునుజ్జయి, గుర్తు పట్టరాకుండా ఉందని పేర్కొన్నారు. మృతుడు పూలతో ఉన్న నలుపు రంగు చొక్కా, స్కై బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్ ధరించాడన్నారు. మృతదేహాన్ని జమ్మికుంట ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించామని తెలిపారు. వివరాలు తెలిసినవారు 83285 12176 ఫోన్ నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

ఉమ్మడి జిల్లాకు 'అమృత్' నీరు

- పథకం కింద రూ.568.60 కోట్లు మంజూరు
- పూర్తయిన టెండర్లు
- ప్రారంభమైన పనులు

ఉమ్మడి జిల్లా ప్రొఫైల్..
జిల్లాలు : కరీంనగర్, జగిత్యాల, పెద్దపెల్లి, రాజన్న సిరిసిల్ల
మున్సిపాలిటీలు : 15
కాలపరిమితి : రెండేళ్లు


ఇటీవల బోల్ చెరువు పథకాన్ని పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

పురపాలికల వారీగా మంజూరైన నిధులు..

ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు సంబంధించి 4 జిల్లాల్లోని 15 పురపాలికలకు రూ.568.60 కోట్లు మంజూరయ్యాయి.

పెద్దపల్లి: జిల్లాలోని రామగుండం మినహా 3 మున్సిపాలిటీలకు రూ.56.10 కోట్లు మంజూరయ్యాయి. వీటిలో పెద్దపల్లికి రూ.25.60 కోట్లు, సుల్తానాబాద్‌కు రూ.18.40 కోట్లు, మంథనికి రూ.12.10 కోట్లు.

రాజన్న సిరిసిల్ల: జిల్లాలోని 2 మున్సిపాలిటీలకు రూ.13.35 కోట్లు మంజూరయ్యాయి. వీటిలో సిరిసిల్లకు రూ.104.25 కోట్లు, వేములవాడకు రూ.13.35 కోట్లు.

కరీంనగర్: జిల్లాలోని 5 మున్సిపాలిటీలకు రూ.257.20 కోట్లు మంజూరయ్యాయి. వీటిలో కరీంనగర్‌కు రూ.145.50 కోట్లు, హుజూరాబాద్‌కు రూ.16.25 కోట్లు, జమ్మికుంటకు రూ.33.00 కోట్లు, చొప్పదండికి రూ.36.30 కోట్లు, కొత్తపల్లికి రూ.26.15 కోట్లు.

జగిత్యాల : జిల్లాలోని 5 మున్సిపాలిటీలకు రూ.137.70 కోట్లు మంజూరయ్యాయి. వీటిలో జగిత్యాలకు రూ.38.60 కోట్లు, కోరుట్లకు రూ.41.50 కోట్లు, మెట్‌పల్లికి రూ.19.40 కోట్లు, ధర్మపురికి రూ.23.00 కోట్లు, రాయికల్‌కు రూ.15.20 కోట్లు.

ధర్మపురి: పురపాలికల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. ఇందుకోసం సమృత్–2 పథకం కింద గతేడాది సెప్టెంబర్ 30న రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖకు పంపిన ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. టెండర్ల ప్రక్రియ పూర్తయింది. తాగునీటి వ్యవస్థను పటిష్టం చేయడానికి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని అన్ని పురపాలికలకు నిధులు మంజూరు కావడంతో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది.

ఇటీవలే పనులు ప్రారంభం..

ధర్మపురి పట్టణంలో అమృత్–2 పథకం కింద రూ.23 కోట్లతో చేపడుతున్న తాగునీటి పనులను ఇటీవల స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రారంభించారు. ధర్మపురిలో నూతనంగా 2 ట్యాంకులు నిర్మించడం, మండలంలోని కమలాపూర్ బోల్ చెరువు నుంచి ధర్మపురి పట్టణానికి ప్రత్యేక తాగునీటి పైపులైన్ పనులు చేపట్టడంతోపాటు ఇతర సౌకర్యాలు కల్పించనున్నారు.

2 కార్పొరేషన్లకు రూ.33,539 కోట్లు

ఉమ్మడి జిల్లాలోని 2 కార్పొరేషన్లకు అదనంగా రూ.33,539 కోట్లు మంజూరయ్యాయి. వీటిలో కరీంనగర్‌కు రూ.7,957 కోట్లు, రామగుండానికి రూ.25,582 కోట్లు. ఈ నిధులతో కార్పొరేషన్ల పరిధిలో అండర్ డ్రైనేజీ పనులు చేపట్టనున్నారు.

తీరనున్న తాగునీటి సమస్య

ఏటా వేసవిలో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోయి తాగునీటి సమస్య తలెత్తుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమృత్–2 పథకం ద్వారా ఇది తీరే అవకాశాలున్నాయి. కేంద్రం, రాష్ట్రం 15వ ఆర్థిక సంఘం పురపాలిక సంఘాల వాటా నిధులు ఖర్చు చేసేలా ఈ పథకాన్ని రూపొందించారు. సంబంధిత పనుల టెండర్లను హైదరాబాద్‌కు చెందిన ఏఎంఆర్ ఇండియా లిమిటెడ్, సోదా కన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్, ది ఇండియన్ హ్యూమె పైప్ కంపెనీ లిమిటెడ్(జేవీ) దక్కించుకున్నాయి. ఈ ఏడాది జూన్ 28న అగ్రిమెంట్ చేసుకున్నారు. రెండేళ్ల అనగా 2026 జూన్ 27 వరకు పనులు పూర్తి చేయాల్సి ఉంటుంది. పురపాలికల్లో జనాభాకు అనుగుణంగా ఫీడర్ పైపులైన్లు, సంపులు, నూతన నల్లా కనెక్షన్లు తదితరాలను ఏర్పాటు చేసి, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపనున్నారు.

సార్వత్రిక విద్య.. భవితకు భరోసా

- దూరవిద్యలో పదోతరగతి, ఇంటర్ చదివే అవకాశం
- ప్రారంభమైన అడ్మిషన్లు
- వచ్చే నెల 10వ తేదీ వరకు గడువు

కరీంనగర్: వివిధ కారణాలతో మధ్యలోనే చదువు మానేసిన వారి భవితకు సార్వత్రిక విద్య భరోసానిస్తోంది. ఇలాంటి వారికి ప్రభుత్వం సార్వత్రిక విధానం(దూరవిద్య) ద్వారా చదువుకునే అవకాశం కల్పిస్తోంది. ఈ నెల 8వ తేదీ నుంచి పదోతరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. గత మూడేళ్లలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3,900 మందికి పైగా ప్రవేశాలు పొందగా.. వీరిలో చాలామంది ఉత్తీర్ణత సాధించారు. ఆసక్తి గలవారు www.telanganaopenschool.org వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా సెప్టెంబర్ 10వ తేదీ వరకు గడువు ఉంది.

పదోతరగతిలో ప్రవేశానికి...

సార్వత్రిక విద్యనభ్యసించేందుకు 14 ఏళ్ల నుంచి 50 ఏళ్ల వయసువారు అర్హులు. ఎలాంటి విద్యార్హత లేకున్నా ప్రవేశం పొందవచ్చు. వయసు నిర్ధారణకు తహసీల్దార్ లేదా మున్సిపాలిటీ అధికారులు జారీ చేసిన ధ్రువపత్రం ఉండాలి. గతంలో ప్రాథమిక పాఠశాలలో చేరినవారు మధ్యలో బడి మానేస్తే టీసీ, స్టడీ, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు ప్రవేశం పొందవచ్చు. ఓసీ కేటగిరికీ చెందిన పురుషులు రూ.1,550, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మాజీ సైనికోద్యోగుల పిల్లలు, దివ్యాంగులు, మహిళలు రూ.1,150 రుసుము, రిజిస్ట్రేషన్ ఫీజు రూ.100 చెల్లించాలి.

ఇంటర్‌లో చేరాలంటే...

ఇంటర్‌లో అడ్మిషన్ పొందేందుకు 15 ఏళ్ల వయసు ఉండి, పదోతరగతి ఉత్తీర్ణులైనవారు అర్హులు. పదోతరగతి ఒరిజినల్ మెమో, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ప్రవేశం పొందవచ్చు. సైన్స్ గ్రూపులు సైతం అందుబాటులో ఉన్నాయి. ఓసీ కేటగిరీ పురుషులు ప్రవేశ రుసుం రూ.1,800, రిజర్వేషన్ వర్తించేవారు రూ.1,500, రిజిస్ట్రేషన్ ఫీజు రూ.200 చెల్లించాలి. స్టడీ సెంటర్లలో ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. మధ్యవర్తులను గానీ, దళారులను గానీ ఆశ్రయించవద్దని సంబంధిత అధికారులు చెబుతున్నారు. పదోతరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలు పొందేందుకు ధ్రువపత్రాలకు మీసేవ ఆన్‌లైన్ రసీదు జత చేసి, ఉమ్మడి జిల్లా కో–ఆర్డినేటర్ పరిశీలనకు నిర్ణీత సమయంలో పంపించాల్సి ఉంటుంది. డీఈవో నియమించిన అడ్మిషన్ కమిటీ దరఖాస్తులను పరిశీలించి, ప్రవేశాలను నిర్ధారించనుంది. ఏవైనా సందేహాలుంటే ఉమ్మడి జిల్లా కో–ఆర్డినేటర్ చలువాజు నాగేశ్వర్‌రావును 83092 12661 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని డీఈవో జనార్దన్‌రావు సూచించారు.

సద్వినియోగం చేసుకోండి



చదువు మధ్యలో మానేసిన వారికి ఓపెన్ విద్య ఓ వరం. గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువత సార్వత్రిక విద్యను సద్వినియోగం చేసుకోవాలి. ఉపాధి అవకాశాలు పెంచుకోవడానికి ఇది మంచి అవకాశం.

– జనార్దన్‌రావు, డీఈవో, కరీంనగర్

చికిత్స పొందుతూ ముగ్గురి మృతి

కమాన్‌పూర్(మంథని): మండలంలోని జూలపల్లికి చెందిన కొయ్యడ కుమార్(36) ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. కుమార్ 20 రోజుల క్రితం మద్య మత్తులో భార్య రజితతో గొడవపడ్డాడు. ఆమె అదేరోజు ఇద్దరు కూతుళ్లను తీసుకొని, రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలో ని తన పుట్టింటికి వెళ్లిపోయింది. శనివారం మధ్యాహ్నం కుమార్ ఇంట్లోనే క్రిమిసంహారక మందు తాగాడు. స్థానికులు 108 వాహనంలో పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు కమాన్‌పూర్ ఎస్సై ప్రసాద్ పేర్కొన్నారు.

విషపురుగు కుట్టి మహిళ..

మానకొండూర్ రూరల్: విషపురుగు కుట్టి ఓ మహిళ మృతిచెందిన ఘటన మానకొండూర్ రూరల్ మండలంలోని లక్ష్మీపూర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు, మృతురాలి బంధువుల వివరాల ప్రకారం.. లక్ష్మీపూర్‌కు చెందిన చుక్కల లచ్చమ్మ (50) శనివారం పశువులకు మేత వేయడానికి గడ్డిపై ఉన్న కవర్ తీస్తుండగా ఎడమ కాలును విషపురుగు కుట్టింది. బాధితురాలి కేకలు విన్న చుట్టుపక్కలవారు అక్కడికి చేరుకొని, ఆమెను కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. లచ్చమ్మ చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందింది. మృతురాలికి ఒక కుమారుడు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. కుమారుడు రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సదన్‌కుమార్ తెలిపారు.


లచ్చమ్మ (ఫైల్)

వేగురుపల్లికి చెందిన యువకుడు..

పెద్దపల్లిరూరల్: మద్యం మత్తులో క్రిమిసంహారక మందు తాగిన కనుకుంట్ల కార్తీక్(30) చికిత్స పొందుతూ మృతిచెందాడు. పెద్దపల్లి ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. మానకొండూరు మండలం వేగురుపల్లికి చెందిన కార్తీక్‌కు సుల్తానాబాద్ మండలంలోని చిన్నకల్వలకు చెందిన మౌనికతో 6 నెలల క్రితం పెళ్లయింది. కూలీ పనులు చేసే కార్తీక్ మద్యానికి బానిసయ్యాడు. రాఖీ పండగకు భార్యతో కలిసి అత్తగారింటికి వచ్చాడు. ఈ నెల 20న పెద్దపల్లిలోని ఎల్లమ్మ గుడి వద్ద మద్యం సేవించి, ఆ మత్తులో క్రిమిసంహారక మందు తాగాడు. తర్వాత కుటుంబసభ్యులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చాడు. వారు అతన్ని స్థానిక ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కరీంనగర్‌కు, అక్కడినుంచి హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మరణించాడు. మృతుడి తల్లి మణెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వాలీబాల్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా ఎన్నిక


శ్రీనివాస్

కరీంనగర్: వాలీబాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ఆసంపల్లి శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం కరీంనగర్ జ్యోతినగర్‌లో నిర్వహించిన సమావేశంలో ఎన్నికల అనంతరం ఆయన ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు, పోలీస్ శాఖలో ఆర్ఐ, సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కన్న రమేశ్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు పడాల అజయ్‌గౌడ్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు జూపల్లి తిరుమలరావు, కార్యదర్శి దేవి వెంకటరమణ, కరీంనగర్ జిల్లా కార్యదర్శి ఆరిఫ్, దాదాపు 70 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను పలువురు సన్మానించారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి


గంగాధర్ (ఫైల్)

కథలాపూర్(వేములవాడ): మండలంలోని గంభీర్‌పూర్‌కు చెందిన గండి గంగాధర్(56) అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వారి వివరాల ప్రకారం .. గంగాధర్ శనివారం రాత్రి కిరాణ దుకాణానికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి, బైక్‌పై వెళ్లాడు. రాత్రయినా తిరిగి రాలేదు. ఫోన్ చేస్తే స్పందించలేదు. దీంతో కుటుంబసభ్యులు, స్థానికులు చుట్టుపక్కల వెతకగా ఆదివారం ఉదయం గ్రామ శివారులోని పొలంలో చనిపోయి కనిపించాడు. అతని మృతదేహంపై బైక్ పడి ఉంది. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. మృతుడి ఇద్దరు కుమారులు గల్ఫ్‌లో ఉన్నారు. తండ్రి మరణవార్త తెలియడంతో ఇంటికి బయలుదేరారు. సోమవారం స్వగ్రామానికి చేరుకోనున్నారని, తర్వాత అంత్యక్రియలు నిర్వహిస్తామని బంధువులు పేర్కొన్నారు.

విషజ్వరంతో యువకుడు..


ప్రశాంత్ (ఫైల్)

ధర్మారం(ధర్మపురి): మండలంలోని నందిమేడారం గ్రామానికి చెందిన నేరెళ్ల ప్రశాంత్ (24) విషజ్వరంతో మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. వారి వివరాల ప్రకారం .. ప్రశాంత్ వారం రోజులుగా జ్వరంతో బాధ పడుతున్నాడు. స్థానికంగా వైద్యం చేయించుకున్నా తగ్గలేదు. దీంతో కుటుంబసభ్యులు రెండు రోజుల క్రితం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం చనిపోయాడు. మృతుడికి భార్య ఉంది.

బిహార్ కూలీ దుర్మరణం

తిమ్మాపూర్(మానకొండూర్): వ్యాన్ పైనుంచి వెళ్లడంతో ఓ మిల్లులో పని చేస్తున్న బిహార్ కూలీ మృతిచెందాడు. కార్మికులు, పోలీసుల వివరాల ప్రకారం.. కరీంనగర్ కార్పొరేషన్ 8వ డివిజన్ పరిధి అల్గునూర్‌లోని భాస్కర్ రైస్‌మిల్లులో బిహార్‌కు చెందిన కిశోర్(39) కార్మికుడిగా పని చేస్తున్నాడు. శనివారం రాత్రి పని ముగించుకొని, మిల్లులోని రేకుల షెడ్డు కింద నిద్రించాడు. అదే సమయంలో మిల్లులోకి వచ్చిన కోడిగుడ్ల వ్యాన్‌ను వర్షం పడుతుండటంతో డ్రైవర్ షెడ్డు కింద నిలిపాడు. వాన తగ్గిన తర్వాత వ్యాన్‌ను రివర్స్ తీసుకుంటుండగా కిశోర్ పైనుంచి వెళ్లింది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. మిల్లు యాజమాన్యం కిశోర్ మృతదేహాన్ని రాత్రే కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించింది. కోడిగుడ్ల వ్యాపారి, మిల్లు యాజమాన్యం ఆదివారం ఉదయం మృతుడి కుటుంబసభ్యులు, పెద్ద మనుషులతో మాట్లాడి, పరిహారం ఇచ్చేందుకు ప్రయత్నించినట్లు ఆరోపణలు వచ్చాయి.

నైవేద్యం తయారీలో నిర్లక్ష్యంపై సీరియస్

- వంట బ్రాహ్మణుడిని సస్పెండ్ చేసిన రాజన్న ఆలయ ఈవో
- కాంట్రాక్ట్ ఉద్యోగి కూడా..
- ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి సరెండర్
- బదిలీ అయిన ఉద్యోగి వేతనంలో కోతకు సిఫారసు

వేములవాడ: స్థానిక రాజరాజేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి నైవేద్యం తయారీలో ఉద్యోగుల నిర్లక్ష్యంపై ఆలయ ఈవో వినోద్‌రెడ్డి సీరియస్ అయ్యారు. మద్యం సేవించి, విధులకు హాజరైన అంశం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమవడంతో వంట బ్రాహ్మణుడు సంతోష్‌ను ఆదివారం సస్పెండ్ చేశారు. అలాగే, గతంలో విజిలెన్స్ దాడులు, ఆరోపణలు ఎదుర్కొన్న కాంట్రాక్టు ఉద్యోగి మధుపైనా సస్పెన్షన్ వేటు వేశారు. నైవేద్యశాలలోనే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌ను సరెండర్ చేశారు. అక్టోబర్ 13, 2021లో రాజన్న ఆలయంలో విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఆ సమయంలో జూనియర్ అసిస్టెంట్ నక్క తిరుపతికి పనిష్మెంట్ కింద రూ.85 వేలు చెల్లించాలని ఆదేశించినా ఇప్పటివరకు చెల్లించలేదు. ఆయన ఇటీవల జరిగిన ఆలయ ఉద్యోగుల బదిలీల్లో భాగంగా యాదగిరిగుట్టకు వెళ్లారు. దీంతో సదరు ఉద్యోగి వేతనంలో కోత విధించాలంటూ యాదగిరిగుట్ట ఈవోకు సిఫారసు చేశారు. విషయం తెలుసుకున్న తిరుపతి త్వరలోనే రూ.85 వేలు చెల్లిస్తానని ఇక్కడి అధికారులకు చెప్పినట్లు తెలిసింది.

రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపిక

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లి శివారులోని వెలిచాల క్రాస్‌రోడ్ వద్ద సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాస్థాయి సైక్లింగ్ ఎంపిక పోటీలను ఆదివారం నిర్వహించారు. ఈ పోటీలను సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు బి.మధుసూదన్ రెడ్డి, బాధ్యులతో కలిసి అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి ప్రారంభించారు. అండర్–14 బాలుర విభాగంలో వి.గౌతమ్, ఎం.నాగసాయి, వి.నేహార్, కె.అనిరుధ్, పి.శ్రేష్, బి.అక్షయ్, అండర్–16 విభాగంలో ఎస్.ఆర్.లికిల్ అనీష్, అండర్–18 విభాగంలో వి.హతికేశ్, బి.నిషద్ధ్, జె.సంజన్‌ఆదిత్య సత్తా చాటి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. వారికి బహుమతి ప్రదానం చేసి, అభినందించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా బాధ్యులు ఎన్.వేణుగోపాల్, ఇనుగుర్తి రమేశ్, అరవింద్ బాబు, అన్వేశ్, జిల్లా టీం మేనేజర్లు, కోచ్‌లు, ప్రతినిధులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సైక్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న మధుసూదన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి

రోడ్డు కిందికి దూసుకెళ్లిన కారు

- పొదల్లో ఆగిపోవడంతో తప్పిన పెనుప్రమాదం

జగిత్యాల క్రైం: ఓ కారు అదుపుతప్పి, రోడ్డు కిందికి దూసుకెళ్లింది. వ్యవసాయ బావి వద్ద పొదల్లో ఆగిపోవడంతో పెనుప్రమాదం తప్పిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా మోతెకు చెందిన ముగ్గురు వ్యక్తులు ఆదివారం మంచిర్యాల జిల్లా లక్సెట్‌పేట్‌లో జరుగుతున్న శుభకార్యానికి కారులో బయలుదేరారు. జగిత్యాల రూరల్ మండలంలోని తాటిపెల్లి శివారులో జగిత్యాల–నిజామాబాద్ ప్రధాన రహదారిపై వాహనం అదుపుతప్పి రోడ్డు కిందికి దూసుకెళ్లింది. సరిగ్గా వ్యవసాయ బావి వద్ద పొదల్లో చిక్కుకొని, ఆగిపోయింది. కారులో ఉన్నవారు కేకలు వేయడంతో స్థానికులు వచ్చి, డోర్లు తెరిచి, బాధితులను బయటకు తీశారు. ఆ ముగ్గురూ స్వల్ప గాయాలతో బయటపడగా వెంటనే 108 వాహనంలో జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.


వ్యవసాయ బావి వద్ద పొదల్లో ఆగిపోయిన కారు

పెళ్లన్నాడు.. ముఖం చాటేశాడు

- యువకుడి ఇంటి ఎదుట యువతి భైఠాయింపు

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): ప్రేమించానన్నాడు.. పెళ్లి చేసుకుంటానన్నాడు.. చివరికి అమ్మానాన్న పేరు చెప్పి, ముఖం చాటేశాడో యువకుడు.. తాను మోసపోయానని, న్యాయం చేయాలంటూ బాధిత యువతి అతని ఇంటి ఎదుట భైఠాయించింది. ఆమె వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలంలోని పెద్దంపేటకు చెందిన సౌమ్య డిగ్రీ చదువుకుంది. అదే గ్రామానికి చెందిన జక్కుల శివకుమార్ అనే ట్రాక్టర్ డ్రైవర్ ప్రేమిస్తున్నానంటూ ఆమె వెంట పడ్డాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించడంతో ఒప్పుకుంది. వీరు నాలుగేళ్లుగా ప్రేమలో ఉన్నారు. ఈ క్రమంలో సౌమ్య కుటుంబసభ్యులు పెళ్లి సంబంధాలు చూస్తామనడంతో విషయాన్ని శివకుమార్‌కు చెప్పింది. దీనికి అతను ఎక్కడికైనా వెళ్లి, పెళ్లి చేసుకుందామన్నాడు. ఇంతలోనే మనసు మార్చుకొని, పెళ్లి చేసుకుంటే మా అమ్మానాన్న ఆత్మహత్య చేసుకుంటామంటున్నారని చెప్పాడు. ఆమెతో వివాహానికి నిరాకరించాడు. అయినా సౌమ్య పెళ్లికి పట్టుబట్టడంతో అతను ఇంటికి తాళం వేసి, తల్లిదండ్రులతో కలిసి పరారయ్యాడు. దీంతో బాధితురాలు ఆదివారం శివకుమార్ ఇంటి ఎదుట ముందు భైఠాయించి, నిరసన తెలిపింది. స్థానిక కొందరు మహిళలు ఆమెకు మద్దతు పలికారు. పోలీసులకు సమాచారం అందడంతో ఏఎస్సై నీలిమ, కానిస్టేబుళ్లు వచ్చి, సౌమ్యను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. తన బిడ్డకు ప్రేమించిన వ్యక్తితో పెళ్లి జరిపించి, న్యాయం చేయాలని ఆమె తల్లి కోరుతోంది.


యువతిని ఠాణాకు తీసుకెళ్తున్న పోలీసులు

కొండగట్టు అంజన్నకు మొక్కులు


క్యూలైన్లలో వేచివున్న భక్తులు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీఆంజనేయ స్వామివారిని ఆదివారం వేలాది మంది భక్తులు దర్శించుకొని, మొక్కులు చెల్లించుకున్నారు. వృద్ధులు ఆలయంలోని క్యూలైన్‌లో ఆగిపోయి, నడవలేని స్థితిలో ఉండటంతో సిబ్బంది వారిని ప్రత్యేక లైన్ ద్వారా అనుమతించారు. ఈవో రామకృష్ణారావు, ఏఈవో అంజయ్య, అధికారులు హరిహరనాథ్, ఉమామహేశ్వరరావు, సిబ్బంది సేవలందించారు.


స్వామివారికి మొక్కుతున్న భక్తులు

రాజన్న సన్నిధికి 40 వేల మంది భక్తులు


ఆలయ ఆవరణలో భక్తుల సందడి

వేములవాడ: ఎములాడ రాజన్న క్షేత్రం ఆదివారం మినీ మహాశివరాత్రి జాతరను తలపించింది. వరుస సెలవులు రావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన 40 వేల మంది భక్తులు వచ్చినట్లు ఏఈవో రమేశ్‌బాబు తెలిపారు. ఆలయ ఆవరణతోపాటు పట్టణంలోని వీధులన్నీ భక్తజనంతో కిటకిటలాడాయి. ధర్మగుండంలో స్నానాలు చేసినవారు స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. వీఐపీల తాకిడి పెరగడంతో ప్రొటోకాల్ పీఆర్వో కార్యాలయానికి తాళం వేశారు. బ్రేక్ దర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్లు నిండిపోవడంతో ఆలయ ఏఈవోతో కలిసి ప్రొటోకాల్ పీఆర్వో అశోక్ పరిస్థితిని చక్కదిద్దారు.


కోడెమొక్కు చెల్లించుకుంటున్న భక్తులు